# 3,71,04,980 టన్నులు

## ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణి బొగ్గు ఉత్పత్తి

- 95 శాతం పూర్తి.. లక్ష్యానికి అడుగు దూరంలో..
- సత్ఫలితాలిస్తున్న సీఎండీ శ్రీధర్ దిశానిర్దేశం.. అధికారుల ముందస్తు ప్రణాళికలు


ఓపెన్ కాస్టు గనిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 1 : సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతున్నది. ఈ ఏడాదిలో అక్టోబర్ నెలాఖరు నాటికి 95 శాతం ప్రొడక్షన్‌తో లక్ష్యానికి అడుగుదూరంలో నిలిచింది. ప్రతి నెలా మొదటి వారంలో సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ దిశా నిర్దేశం మేరకు డైరెక్టర్ల సూచనలతో అన్ని ఏరియాల జీఎంలు, సంబంధిత అధికారుల ముందస్తు ప్రణాళికలు సత్ఫలితాన్నిచ్చింది. అలాగే అక్టోబర్ నెలలో సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో 86 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. అక్టోబర్‌లో గాంధీ జయంతి, దసరా, ఆదివారం సెలవుదినం కావడంతో బొగ్గు ఉత్పత్తిలో కొంత వెనుకబడి ఉన్నట్లు తెలుస్తున్నది.

### అక్టోబర్‌లో ఉత్పత్తి వివరాలు..

| ఏరియా | టార్గెట్ | ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| కొత్తగూడెం | 11,88,500 | 10,81,887 | 91 |
| ఇల్లెందు | 2,50,000 | 3,72,000 | 149 |
| మణుగూరు | 10,48,000 | 11,03,755 | 105 |
| బెల్లంపల్లి | 2,00,000 | 3,42,997 | 171 |
| మందమర్రి | 4,04,500 | 3,65,658 | 90 |
| శ్రీరాంపూర్ | 5,82,000 | 4,03,524 | 69 |
| ఆర్జీ-1 | 3,92,900 | 3,45,551 | 88 |
| ఆర్జీ-2 | 8,02,700 | 8,67,228 | 108 |
| ఆర్జీ-3 | 4,40,000 | 4,42,871 | 101 |
| అడ్రియాలా | 1,48,100 | 1,84,409 | 125 |
| భూపాలపల్లి | 4,45,000 | 2,77,313 | 62 |
| మొత్తం | 67,01,700 | 57,87,193 | 86 |

### 2023-24 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) లో..

| ఏరియా | టార్గెట్ | ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| కొత్తగూడెం | 71,19,500 | 78,42,616 | 110 |
| ఇల్లెందు | 16,23,000 | 21,25,046 | 131 |
| మణుగూరు | 64,78,200 | 78,48,405 | 121 |
| బెల్లంపల్లి | 16,50,000 | 21,30,607 | 129 |
| మందమర్రి | 25,04,500 | 21,82,953 | 87 |
| శ్రీరాంపూర్ | 36,73,000 | 29,46,897 | 80 |
| ఆర్జీ-1 | 24,38,100 | 22,75,979 | 93 |
| ఆర్జీ-2 | 49,59,000 | 46,15,416 | 93 |
| ఆర్జీ-3 | 28,70,000 | 24,41,599 | 99 |
| అండ్రియాలా | 10,21,700 | 6,60,721 | 65 |
| భూపాలపల్లి | 26,00,000 | 16,34,738 | 63 |
| మొత్తం | 3,88,87,000 | 3,71,04,980 | 95 |



డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ రంగనాథ ఈశ్వర్‌ను సన్మానిస్తున్న మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ బాధ్యులు

# పర్యావరణహిత మైనింగ్‌కు కృషి జరగాలి

- కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు ప్రాధాన్యమివ్వాలి
- మైనింగ్ మేధావుల ఉద్ఘాటన
- హైదరాబాద్ చాప్టర్ కార్యాలయంలో ఇండియన్ మైనింగ్ డే ఉత్సవాలు

శ్రీరాంపూర్, నవంబర్ 1 : అత్యాధునిక సాంకేతికతతో జాతి ప్రయోజనాల కోసం ఖనిజ సంపదను వెలికి తీయడంతో పాటు పర్యావరణ హిత మైనింగ్ దిశగా మరింత కృషి జరగాలని సీనియర్ మైనింగ్ మేధావులు పిలుపునిచ్చారు. మైనింగ్ ఇంజినీర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ కార్యాలయంలో బుధవారం ఇండియన్ మైనింగ్ డే వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ రంగనాథ ఈశ్వర్, ఎంఈఏఐ మాజీ అధ్యక్షుడుఎండీ ఫసియుద్దీన్, రాజగోపాల్, రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచంలోనే భారత్ ఒక అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ఖనిజ సంపద వెలికి తీయడం, సద్వినియోగం చేయడంలో ఇంజినీర్లు బృహత్తరమైన పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. అదే సమయంలో పర్యావరణానికి హాని కల్గించకుండా మైనింగ్ ప్రక్రియ కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు పర్యావరణ హిత మైనింగ్ పద్ధతులు అందుబాటులోకి వచ్చినందున పర్యావరణానికి, సమీప గ్రామాలకు హాని కలుగని మేలైన పద్ధతులను పాటించేలా మైనింగ్ ఇంజినీర్లు మార్గ నిర్దేశం చేయాలని కోరారు. మైనింగ్ డే ను ఎంఈఏఐ సంస్థ ఉత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ మైనింగ్ కళాశాలలో విద్యార్థులకు మైనింగ్ రంగంలో కార్బన్ ఉద్గారాల తగ్గింపుపై ప్రత్యేక క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ సాహూ, ప్రధాన కార్యదర్శి ఎం నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ వెంకటరామయ్య, హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి ఎల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కాసిపేట : తోటి ఉద్యోగి కుటుంబానికి సాయం అందిస్తున్న ఉద్యోగులు

# తోటి ఉద్యోగి కుటుంబానికి సాయం

కాసిపేట, నవంబర్ 1 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన జనరల్ మజ్దూర్ ఉద్యోగి దుండ్రు ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, తోటి ఉద్యోగులు తమ వంతుగా రూ.80 వేలు సేకరించారు. రూ.50 వేలు ఐలయ్య కూతురు పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి, బాండ్‌తో పాటు రూ.30 వేల నగదును కుటుంబ సభ్యులకు గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా అందించారు. ఫోర్‌మన్ వొడ్నాల రాజన్న, పిట్ ఇంజినీర్ బాపు, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు పుప్పాల శ్రీనివాస్, కనుకుల తిరుపతి, సతీశ్ యాదవ్, మల్లేశ్, నిఖిల్, రఘురాం, సత్యనారాయణ, ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్స్, సూపర్‌వైజర్స్, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానానికి ముందుకు

శ్రీరాంపూర్, నవంబర్ 1 : శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గని సర్దార్‌గా విరమణ పొందిన కొంకుముట్టి శ్రీనివాస్ నేత్ర దానానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సలహాదారు నూక రమేశ్ బుధవారం ఆయనకు ప్రశంసా పత్రం, అంగీకర పత్రం అందించారు. ఇతరులు కూడా శ్రీనివాస్‌ను స్ఫూర్తిగా తీసుకొని, అవయవ దానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.


శ్రీనివాస్‌కు ప్రశంసా పత్రం ఇస్తున్న సభ్యులు


ఆర్కే-5 గనిపై సేఫ్టీ కమిటీ అధికారులు, ఉద్యోగులు

# రక్షణ, ఉత్పత్తిలో ఆర్కే-5 ముందుంజ

**సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఏజీఎం కేజీ తివారీ**

శ్రీరాంపూర్, నవంబర్ 1 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5గని రక్షణ, ఉత్పత్తిలో ముందున్నదని సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఏజీఎం కేజీ తివారీ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5 గనిపై బుధవారం 54వ రక్షణ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. గని ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ డీవై జీఎం అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఏజీఎం కేజీ తివారి, కే కనకయ్య, డీవై జీఎం మురళీధర్, జైనులాబుద్దీన్, తోట సత్యనారాయణ, శ్రీనివాస్ అధికారుల బృందం గనిని, గనిపై డిపార్ట్‌మెంట్లను సందర్శించింది. గనిపై కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించింది. ఈ సందర్భంగా సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఏజీఎం కేజీ తివారి మాట్లాడుతూ.. అధికారులు కార్మికులకు రక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. కార్మికుల్లో సేఫ్టీపై వివిధ మాధ్యమాల ద్వారా, యూట్యూబ్ ద్వారా, స్థానిక మీడియా ద్వారా వివరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆర్కే-5, 5బీ గనిలోని సెక్షన్ 2 సీమ్ పనిస్థలాలను తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఉత్పత్తి పని స్థలాలను సందర్శించి, రక్షణ చర్యలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి, సేఫ్టీ కమిటీ అధికారులు తోట సత్యనారాయణ, టీ రాజన్న, కుమార్, రాజునాయక్, సంతోష్, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్, సేఫ్టీ ఆఫీసర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సహకరించాలి

శ్రీరాంపూర్, నవంబర్ 1 : శ్రీరాంపూర్ ఏరియాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ రమేశ్ బాబు కోరారు. శ్రీరాంపూర్ ఆర్కే-6 గుడిసెలు హిమ్మత్‌నగర్‌లో బుధవారం ఎస్ఐ రాజేశ్ ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్‌పై, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరుతూ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డిసెంబర్ 5 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటున్నారు. ఈ నెల 30న ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. వివిధ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ఉల్లంఘిస్తే C.vizil app ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు కలిగి ఉంటే తప్పని సరిగా ఆధారాలు చూపాలన్నారు.


మాట్లాడుతున్న సీఐ రమేశ్‌బాబు